
# స్వయంవరం

కాంకాని కమల



ఉదయం కాఫి తాగుతూ పేపరు తెరిచిన విష్ణువర్ధన్ ఫ్రంట్ పేజీలో, పెద్ద బాక్సు ఐటమ్‌గ 'మళ్ళీ' ప్రత్యక్షం ఆయిన ఆ స్వయం వరం ప్రకటన చూస్తూనే ఆశ్చర్యపోయ్యాడు.

సరిగ్గా 3 నెల్ల క్రితం, అదే ప్రకటన, అదే చోట్లో, అదే పేపర్లో మొదటి పేజీలోనే వచ్చింది. మళ్ళీ రెండు నెల్లు నిండిందో లేదో అదే ప్రకటన... అదే వాక్యాలతో.... విష్ణుకి చాలా వింతగా ఆనిపించింది ఆ స్వయంవర ప్రకటన.

ఆమె చాలా అందంగా ఉంటుంది బాగా డబ్బుంది. పెద్ద పెద్ద వ్యాపారాలు. తల్లితండ్రులకి ఒక్కర్తే కూతురు.... ఆ అమ్మాయి వరపరీక్షలో 3

ప్రశ్నలు అడుగుతుందిట. వాటికి అభ్యర్థులుగా వచ్చిన వరులు, ఆమెకి నచ్చిన సమాధానం చెప్తే అతణ్ని పెళ్ళి చేసుకుంటుందిట.

ఇంక వరుని అందం, చదువు, డబ్బు ఇలాంటి గురించిన వివరాలేమీ ఆ ప్రకటనలో అడగలేదు.

విష్ణుకి నవ్వు వచ్చింది.

ఇంతకు ముందు 3 నెల్ల క్రితం ఇలాంటి ప్రకటనే ఇచ్చింది.

బహుశా ఆమె పరీక్షలో నెగ్గిన అభ్యర్థులు, ఆమెకి నచ్చిన పెండ్లి కొడుకులు వచ్చి వుండరు. అందుకే మళ్ళీ ప్రకటన ఇచ్చింది.

ఈ రోజుల్లో ఆడ పిల్లలు కూడా ఏం తక్కువ లేరు. విష్ణు కూడా పెళ్ళి కొడుకే.

ఆ మధ్య దూరపు బంధువు ఒకాయన విష్ణుకి ఒక సంబంధం తెచ్చాడు. ఇల్లరికం వెళ్ళాలి. బాగా కట్నం ఇస్తారు. ఆ కట్నం సొమ్ము విష్ణు తల్లితండ్రులు వాడుకోవచ్చు. పెళ్ళి అయిన మర్నాటి నుంచి పెళ్ళి కొడుకు వాళ్ళ దగ్గరే ఉండాలి. వాళ్ళకి ఆయిల్ మిల్సు, ఫిల్టర్లు ఉన్నాయి. ఆ వ్యవహారాలు అన్నీ అల్లుడే చూసుకోవాలి.

'ఏముంది ఇందులో. ఇల్లరికం అయితే తప్పేమిటి? మీ అబ్బాయికి మంచి హోదా వస్తుంది. చేతినిండా పని ఉంటుంది మీకు కష్టాలు గట్టెక్కుతాయి. మీ అమ్మాయిలు కట్నం సమస్య వల్లే పాతికేళ్ళు వస్తున్నా ఇంకా పెళ్ళిళ్లు కాలేదు. వాళ్లని ఓ అయ్య చేతిలో పెట్టచ్చు.' అన్నాడు మధ్య వర్తి విష్ణు తండ్రితో.

విష్ణు తండ్రి కాస్త ప్రలోభంలో పడ్డాడు.

కాని విష్ణు తల్లి ఒప్పుకోలేదు.

"నా బిడ్డని అమ్ముకోలేను. వాడు గంజి తాగినా నా కళ్ళముందు వుండాల్సిందే" అంది.

"అవును" అన్నాడు విష్ణు.

అసలు విష్ణుకి అయిన సంబంధాలున్నాయి. కాని వాళ్ళది అంతంత మాత్రపు పరిస్థితులే. డబ్బు కోసమే పరాయిగా ఆలోచించటం.

* * *

పేపర్లో ప్రకటన ఎందుకో విష్ణుని కదిలిస్తోంది. ఆ ఆలోచనలు అతన్ని వదలటం లేదు. పేపరు చేతిలో పెట్టుకుని మళ్ళీ మళ్ళీ ఆ స్వయం వర ప్రకటన చదువుతూ ఎన్నో రకాల ఆలోచనల్లో పడిపోయ్యాడు.

"ఏంట్రా అబ్బాయ్. ఇవ్వాళ ఆఫీసుకి వెళ్ళవా? టైము అవుతోంది కదా?" తల్లి వంట గదిలోంచి కేకేసింది.

"లేదమ్మా వెళ్ళాలి" అంటూ పేపరు పక్కన పడేసి లేచాడు.

* * *

ఆ రోజు ఆఫీసుకి వెళ్ళాక మనసు ఆగక తన కొలీగ్ నాగరాజు దగ్గర ఎత్తాడు ఆ ప్రకటన గురించి.

నాగరాజు పకపక నవ్వాడు.

"ఏమిటి? ఆ పార్టీ గురించి నీకు తెలియదా?"

"నీకు తెలుసా?"

"నాకేంటి? ఊరూ వాడా తెలుసు."

"నిజమా?"

"అవును. ఆ పిల్ల పేరు మేనక. తండ్రి కోటీశ్వరుడు మేనక పేరుకి తగినట్టే అందంగా ఉంటుంది. కాని మహా పొగరు. తండ్రి ఆడింది ఆటగా పెంచాడు. పరీక్షలో ఆమె మూడు ప్రశ్నలు అడుగుతుందిట. అయితే ఇంతవరకు ఒక్కరు ఆమె పెట్టిన వరపరీక్షలో నెగ్గలేదు. అంతా వెనక్కి పొయ్యారు."

"నిజమా?"

"నిజమే. కావాలంటే నువ్వు వెళ్ళి చూడు."

ఏదో ఆలోచిస్తు అన్నాడు విష్ణు "ఆమెకి మరీ అంత పొగరా?"

"అంత కాదు ఎంతో పొగరు."

"అలా అయితే ఎవడు చేసుకుంటాడు?"


"ఎవడూ చేసుకోడు. చేసుకున్నా నిలదొక్కుకోలేడు."

"ఓ...... ఇంతకి ఏం అడుగుతుందో?" అన్నాడు విష్ణు నాగరాజు కేసి చూస్తూ.

నాగరాజు పకపక నవ్వాడు. "నా ఫ్రెండు సర్కిల్‌లో మళ్ళీ ఇద్దరు వెళ్ళారు ఆమెగారి వర పరీక్షకి. ముందుగా ఒక ప్రశ్న "నా కోసం నువ్వు ఏదైనా చెయ్యగలవా?" అందిట. చేస్తానన్నాడుట. అయితే వెళ్ళి మా బాల్కనీ లోంచి వెంటనే కిందికి దూకు అందిట. వాడు దుకాడుట. కింద ఏ నెట్టో పెట్టి వుంటుంది, ధైర్యాన్ని పరీక్షిస్తోంది అనుకున్నాడుట. కాని కింద ఏ నెట్టు పెట్టలేదు. వాడి కాళ్ళు విరిగినంత పనయి నెల్లాళ్ళా హాస్పిటల్‌లో వుండాల్సి వచ్చిందిట విరిగిన కాళ్ళు నయం అవటానికి. కనీసం వైద్యం ఖర్చులు కూడా ఇవ్వలేదుట. బాల్కనీ మరీ ఎత్తుగా లేకపోవటంతో ఎలాగో బతికి బయట పడ్డాడుట." అన్నాడు మళ్ళీ పకపక నవ్వుతూ నాగరాజు.

విష్ణు చకితుడయ్యాడు. విభ్రమ నుంచి తేరుకుంటూ అన్నాడు "అసలు ఆమె ఎలా దూకమంది వాడెలా దూకాడు?"

"వాడు మూర్ఖుడు. అది మూర్ఖురాలు. ఇంకొకడ్ని స్విమ్మింగ్ పూల్ దగ్గరకి తీసుకెళ్ళిందిట. నీకు ఈత వచ్చా అందిట. వాడు రాదన్నాడుట. బలంగా భుజం పట్టి నీళ్ళల్లోకి తోసిందిట. వాడు నీళ్ళల్లో మునక లేస్తు వుక్కిరి బిక్కిరి అయి చావబోయే సమయానికి పనివాడితో బయటికి తీయించి నీళ్ళు కక్కించిందిట. ఇంత చిన్న నీటి కొలనులో ఈదలేని వాడివి రేపు జీవితంలో కష్టాలు వచ్చినపుడు ఎలా బయట పడతావు? నాకు బోల్డన్ని వ్యాపారాలున్నాయి వాటి ఆటు పోటు ఎలా ఎదుర్కొంటావు? ఆపదలు చెప్పి రావు. అవి వచ్చినపుడు వీరోచితంగా ఎదుర్కోవాలిగాని పిరికి తనంగా మునకలు వెయ్యటం కాదు" అని హేళన చేసి పంపించేసిందిట.... ఇలా తిక్క తిక్క





కొత్త ఢిల్లీలోని ఆం.ప్ర. భవన్‌లో రాష్ట్రావతరణ దినోత్సవ సందర్భంగా జూనియర్ల సంగీత పోటీలలో ప్రత్యేక బహుమతి పొందిన చి॥ కందుకూరి పూజితకు రాష్ట్ర కార్మికశాఖా మంత్రి బాబూమోహన్ మొమెంటో, సర్టిఫికేట్‌లను అందచేస్తున్న దృశ్యం. విచిత్ర వేషధారణలో రెండవ బహుమతి గెలుచుకొని మొమెంటోను అందుకుంటున్న శ్రీమతి ఎమ్. సత్యకుమారిని కూడా చిత్రంలో చూడవచ్చు.

ప్రశ్నలు అడిగి ఇబ్బంది పెడుతుందిట. ఆమె చెప్పిన పని చేస్తే "నేను చెప్పినంత మాత్రాన చెయ్యటమేనా? నీకు ఇంగితం లేదా? ముందు వెనకలు, మంచి-చెడు ఆలోచించనక్కర్లేదా?" అంటుందిట. చెయ్యకపోతే ఈ సాటి సాహసం చెయ్యలేని వాడివి నువ్వేం పని కొస్తావ్ అంటుందిట."

"టెరిబుల్" అన్నాడు విష్ణు.

"టెరిబులే మరి. అసలు విషయం ఏంటంటే, నిజంగా ఆమెకి పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం లేదని, మగవాళ్ళు అంటే ద్వేషం అని ఎవరో అనగా విన్నాను." అన్నాడు నాగరాజు.

విష్ణుకి అహం దెబ్బ తిన్నట్టు అయ్యింది.

"అంతే అయివుంటుంది మరి ఇంత తెలిసి ఆ వెళ్ళే అభ్యర్థులు ఎలా వెడుతున్నారు?" అన్నాడు కంపరంగా.

నాగరాజుకి మళ్ళీ నవ్వు వచ్చింది. "ఆశ. డబ్బు మీద ఆడదాని అందం మీద ఆశ. దారిద్ర్యం, నిరుద్యోగం భరించలేక, కాలం మారింది అని సమర్థించుకుని వెడుతున్నారు. పైగా ఎవడి అందం మీద వాడికి గొప్ప నమ్మకం. తనే ఓ పెద్ద హీరోని అనుకోవటం వల్ల వచ్చే అనర్థం. ఒక వేళ ఆమెతో పెళ్లి అయితే కార్లు, మేడలు, వ్యాపారాలు. అంతగా ఇద్దరికి సరిపడక విడిపోయే క్షణం వస్తే ఈలోగా అందిన కాడికి ఏదన్న వెనకేసుకోవచ్చు అన్న దురాశ. వెళుతున్నది చిన్న ఇంటర్వ్యూకి. ఎన్ని ఉద్యోగాలకి ఇంటర్వ్యూలుకి వెళ్ళటం లేదు? ఇది అలాంటిదే అనుకుని వెళ్ళే వాళ్ళు వెళుతున్నారు" తేలిగ్గా తేల్చి వేస్తూ నాగరాజు మళ్ళీ పకపక నవ్వాడు.

కాని విష్ణుకి నవ్వు రాలేదు. మనసులో జోరీగలా ఆమె వేసే ప్రశ్నలు, నాగరాజు చెప్పిన విషయాలే తిరుగుతున్నాయి. ఏదో జానపద పాత సినిమాల్లో అలాంటివి చూసిన జ్ఞాపకం. విష్ణుకి ఎందుకో ఆ ఇంటర్వ్యూకి తను వెడితే? అనిపించింది. ఆ మేనక మీద, ఆవిడ డబ్బు మీద ఆశ కాదు. ఆమెకి ఎలాగైనా బుద్ధి చెప్పాలని. అందం డబ్బు చూసుకుని మగవాడ్ని అంత అలుసు చేస్తుందా అన్న ఆవేదన.... ఇలాంటి ప్రశ్నలకి విరుగుడు చెయ్యాలన్న ఆవేశం!

* * *

ఒక నిశ్చయానికి వచ్చినట్లు ఆరోజు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాక మేనక ప్రకటించిన స్వయం వరానికి ఒక అప్లికేషన్ పడేశాడు. అయితే ఆ విషయం ఎవరికి చెప్పలేదు. ఆఖరికి నాగరాజుకి కూడా!

* * *

సరిగ్గా 20 రోజుల తరువాత విష్ణుకి మేనక దగ్గర్నుంచి ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది.

ఆ రోజు ఆఫీసుకి శెలవు పెట్టి డిగ్నిఫైడ్‌గా ముస్తాబయి ఇంటర్వ్యూకి వెళ్ళాడు.

ఆమెని చూస్తూనే అతని కన్ను చెదిరింది. నిజంగానే మేనక చాలా అందంగా ఉంది. డబ్బులో పుట్టిందేమో, ఆ అందానికి మెరుగులు దిద్దుకుంది. ఖరీదైన దుస్తులు, రాజమహలులా ఇల్లు ఈ హంగులన్ని ఆమెని మరింత గొప్ప దాన్నిగా తీర్చి దిద్దాయి.

"నా ఇంటర్వ్యూలో 3 ప్రశ్నలు ఉంటాయి. అందులో నీవు నెగ్గితే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. ఏ ఒక్క ప్రశ్నకి మీరు సరి అయిన జవాబు చెప్పలేకపోయినా ఇంటర్వ్యూలో ఫెయిల్ అయినట్లే" అంది షరతులు చెప్తూ

"సరే" అన్నాడు విష్ణు.

ప్రక్కనే వున్న ఫ్రిజ్‌లోంచి దాదాపు 50-60 కప్పులు ఐస్‌క్రీం తీయించి అతని ముందు బల్ల మీద పెట్టించింది. "అవన్నీ మీరు తినాలి. ఇది నా మొదటి పరీక్ష" అంది.

విష్ణు నిర్లక్ష్యంగా ఒకసారి వాటికేసి చూసి అన్నాడు.

"ఐస్ క్రీం చాలా రుచిగా వుంటుంది. కాని శరీర ఆరోగ్యానికి ఇది చాలా చెడుపు చేస్తుంది. పళ్ళు గొంతుక దెబ్బ తింటాయి. ఎప్పుడైనా సరదాగా ఒకటో రెండో తినచ్చు. కాని ఇన్ని కప్పులు ఒకేసారి తినటం చదువు సంధ్య లేని వాళ్ళు విజ్ఞానం, వివేకం లేని వాళ్ళు చేసేపని. కాని

నాకు విజ్ఞానం, వివేకం ఉన్నాయి. కాబట్టి అవన్నీ ఉన్న చేజేతులా నా ఆరోగ్యాన్ని నేను పాడు చేసుకోను." అన్నాడు సూటిగా ఆమె కేసి చూస్తూ పరీక్షలో ఫెయిల్ అవుతానన్న భయం అతనిలో ఆవగింజంత అయినా కనిపించలేదు. జవాబు కూడా చాలా నిర్లక్ష్యంగా చెప్పాడు.

ఒక్కసారిగా ఆమె వింత పడింది.

తన ఎదురుగా కూర్చోడానికే బిడియ పడిన వాళ్ళని, వినయంగా ఒద్దికగా వున్న వాళ్ళని చూసింది. తను 'ఊ' అంటే చాలు చిరునవ్వు నవ్వితే చాలు అన్నట్లున్న వాళ్ళని చూసింది. కాని ఇంత నిర్లక్ష్యంగా తనని......

మేనక సర్దుకుంది. బింకంగా అంది.

"సరే మీ ఇష్టం. చాత కాదన్న విషయం సూటిగా ఒప్పుకున్నారు కనీసం రెండో పరీక్షలోనయినా ప్రయత్నించండి." అంటు ప్రశ్న అడగబోయింది.

కాని విష్ణు చరాలున కుర్చీలోంచి లేచాడు చెయ్యి అడ్డంగా కదిలిస్తు 'ఆగండి' అన్నాడు.

ఆమె మరింత ఖంగుతింది.

విష్ణు చిరునవ్వుతో చెప్పాడు. "దయచేసి మీరు రెండో ప్రశ్న అడగ కండి. నా కోసం ఈ మేడ మీంచి దూకు. రైలు కింద తల పెట్టే ధైర్యం ఉందా, విమానం నడపగలవా? ఈత రాకపోయినా ఈ సముద్రాన్ని ఈదుకుని రా..... ఇవికాదు మేడమ్ పరీక్షలంటే. ఈత రాక పోతే నీళ్ళలోంచి బయట పడటం చాలా కష్టం. ఒక్కోసారి గజ ఈత గాళ్ళు కూడా నదీ ప్రవాహానికి కొట్టుకొని పోతారు. ప్రాణాలు కోల్పోతారు. ఈత రాకపోయినా నీళ్ళల్లోంచి ఈదుకుంటూ ఒడ్డుకి రావటానికి, జీవితంలో సమస్య వచ్చినపుడు ప్రతి మనిషి వాటి నుంచి బయట పడటానికి విశ్వ ప్రయత్నం చేస్తాడు. కాని కాలం కల్సి రాకపోతే బిల్స్ గేట్సు, బిగ్ బుల్స్ కూడా డౌన్ అవక తప్పదు. చరిత్రలో ఎందరో చక్రవర్తులు, వీరులు, మహా రాజులు మట్టి కరిచారు. వారిలో ధైర్యం సాహసం తెలివి లేక కాదు. కాలం కల్సిరాక. అంత మాత్రాన వారు అసమర్థులు కారు. ఓటమిని ధైర్యంతో ఎదుర్కొని తిరిగి నిలబడటానికి ప్రయత్నిస్తారు. అవి అసలైన జీవిత పరీక్షలు అంటే. ఎవరన్నా నిరాశకి కుంగి ఆత్మ హత్యకి పాల్పడితే వాడు పిరికి వాడు. నిలదొక్కుకున్న వాడు ధైర్యవంతుడు. అంతేగాని ఎవరో ఏదో చెప్పారని ముందు వెనక ఆలోచించకుండా నీళ్ళల్లోకి దూకితే పాతాళానికి చేరతాడు. మేడ మీంచి కిందికి దూకితే కాళ్ళు విరుగుతాయి ఆ తరువాత వాడు జీవితంలో ఎందుకూ పనికిరాడు. కాళ్ళు విరిగినా ఫరవాలేదు, అత్తింటి వారి సొమ్ముతో మంచంలో కూర్చుని తినచ్చు అనుకున్న వాడు పరమ మూర్ఖుడు. డబ్బు మనిషి. వాడికి డబ్బు తప్పించి వేరే ఏమి అక్కర్లేదని అర్థం. కాని అన్ని అవయవాలు సరిగా వుండి, ఆరోగ్యంగా వుంటే కష్టంతో, తెలివితో ఏదన్నా సాధించుకోవచ్చు. అంతేగాని గుడ్డిగా ఎవరు ఏది చెపితే అది చేసేవాడు వ్యక్తిత్వం లేని వాడికింద జమ. వివేక శూన్యుడు అని అర్థం. కాని నాకు వివేకం, విజ్ఞానం, వ్యక్తిత్వం ఉన్నాయి. అందుకే మూర్ఖంగా మీరు పెట్టే పరీక్షల్లో నెగ్గాలన్న దురాశ నాకు లేదు. నిజానికి పరీక్ష అంటే తెలివికి సంబంధించినది. వ్యాపారంలో ఈ సమస్య వస్తే ఏం చేస్తావ్? నష్టం వస్తే ఏం చేస్తావ్.... పోటీ ధారుల్ని ఎలా ఎదుర్కొంటావ్? వ్యాపారాన్ని పెంచటానికి ఎలాంటి పథకాలు ప్రవేశ పెడతావ్.... ఇలాంటివి అడగాలి కాని అహంకారంతో అడిగే ప్రశ్నలకి - క్షమించండి మేడమ్ నేను జవాబులు చెప్పటానికి సిద్ధంగా లేను. నేను మీరు పెట్టే పరీక్షలో గెలవాలని రాలేదు. మీకు (గుణపాఠం) లెసన్ చెప్పాలని వచ్చాను. గుడ్ బై..... " చివాలున వెనక్కి తిరిగాడు.

అనూహ్యమైన ఆ ఎదురు దెబ్బకి ఆమె దిమ్మెర పోయింది. రిచ్చపడింది. తికమక అయ్యింది. విభ్రాంతి నుంచి తేరుకుని ఏదో చెప్పాలని నోరు తెరిచి. ఖంగారుగా చెయ్యి చాపింది కాని అప్పటికే విష్ణు మెరుపు వేగంతో మేడ దిగి కిందికి వెళ్ళి పోయాడు.

మెత్తని చెప్పు తగిలినట్లు మేనక అహం విలవిల్లాడిపోయింది.

* * *

సరిగ్గా నెల రోజుల తరువాత మేనక దగ్గర్నుంచి విష్ణుకి మళ్ళీ ఒక ఉత్తరం వచ్చింది. నేను ఇలా మూర్ఖంగా ఎందుకు ప్రశ్నలు అడిగానంటే మీలా ధైర్యంగా ఎదురు నిలిచి తమ వ్యక్తిత్వాన్ని నిరూపించుకునే వ్యక్తి కోసమే. కాని నా అందం నా డబ్బు మీద ఆశతో వచ్చిన వాళ్ళు దాదాపు అందరూ నన్ను మెప్పించాలని చాలా తాపత్రయ పడి అభాసుపాలు అయ్యారు. కొందరు సగం ప్రశ్నలుకి ప్రయత్నించారు. ఇంకొందరు నన్ను దూషించి వెళ్ళి పోయారు. కాని మీరు మొదట్నుంచి నిజాయితీగా దీటుగా మీ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్నారు. నేను స్వయంవరం ప్రకటించింది నిజానికి మీలాంటి (వ్యక్తిత్వంగల) వ్యక్తి కోసమే. అందరూ అనుకుంటున్నట్లు నాకు పొగరు గర్వం లేవు. నేను మాములు స్త్రీని. మీకు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుందుకు సిద్ధంగా ఉన్నాను. ఇంకొక మాట మీరు ఇల్లరికం రానక్కర్లేదు.

మేనక.

ఆ ఉత్తరం చదివిన విష్ణు నవ్వుకున్నాడు.

మేనక గారికి,

నాకు సంసార పక్షంగా వుండే నా స్థాయికి సరిపడే అమ్మాయి, మా అత్తయ్య కూతురు, నా చిన్న నాటి నేస్తం అయిన సుశీలతో నా వివాహం నిశ్చయం కాబోతోంది. మన్నించండి. ట్రై యువర్ లక్.

విష్ణుమూర్తి.

## స్వీట్ గర్ల్

హీరోయిన్లు తమ ప్రేమ వ్యవహారాలను ఇండస్ట్రీలో అంతరికీ తెలిసినా కూడా మాకు ఎవరితోనూ లవ్ ఎఫైర్స్ లేవు అనడం సహజం. అమృతా అరోరా కూడా ముందు ఇదే కోవలోకి చెందినా, ఇప్పుడు మాత్రం అమీషాపటేల్ సోదరుడు అస్మిత్‌తో లవ్ ఎఫైర్ ఉంది. పటేల్ ఫ్యామిలీ నుంచి నేను వేరుగా అనుకోవడం లేదంటోంది. అమీషా, వాళ్ళ అమ్మ ఆషా పటేల్‌లు అమృతాను, అస్మిత్‌ను విడదియ్యాలని చూడటం నిజం కాదు అంటోంది. అమీషా స్వీట్ గర్ల్, మా ఇద్దరి మధ్యా ఎలాంటి గొడవలూ లేవు, మేము మంచి ఫ్రెండ్స్ అని చెబుతోంది. అంటే అమృతా అరోరా అమృతా పటేల్ అవడానికి సిద్ధంగా ఉందన్నమాట.

